క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యేల పర్యటన

వరదయ్యపాళెం: స్థానిక ఆర్‌ఆర్ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించే గ్రామ వలంటీర్ల సన్మాన సభకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కానున్నారని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

తొట్టంబేడు మండలంలో..

రేణిగుంట : తొట్టంబేడు మండలం పెద్దకన్నలి సచివాలయ పరిధిలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం తెలిపింది. కొత్తకండ్రిగలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడుతారు. సమస్యలను తెలుసుకుంటారు.

65 మందికి ఉచిత కంటి వైద్యపరీక్షలు

పిచ్చాటూరు: 65 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసినట్లు ఎంఎన్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు నవీన్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎన్ కంటి ఆసుపత్రి ఆరంజ్ మిషన్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించింది. 10 మందికి కంటి అద్దాలు, 13 మందిని ఆపరేషన్‌కు రెఫర్ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఏర్పాట్లను సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి పర్యవేక్షించారు. శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ కీర్తన, చారీ, ఆరంజ్ మిషన్ సిబ్బంది సేవలు అందించారు.

నిత్యాన్నదానానికి విరాళం



అంజూరుకు విరాళం అందజేస్తున్న భక్తులు

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రాంబాబు, కల్పన రూ.51,116 నగదును శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. ఆలయ చైర్మన్ వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయించారు. స్వామి,అమ్మవార్ల శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌కు కొత్త లెక్చరర్లు

పిచ్చాటూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాల (హైస్కూల్ ప్లస్)కు ఏడుగురు అధ్యాపకుల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయడంతో నూతన లెక్చర్లు బుధవారం కళాశాలలో చేరినట్లు ప్రిన్సిపల్ యుగంధర్ రాజు తెలిపారు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా మహిలా జూనియర్ కళాశాలను తీర్చిదిద్దడానికి తమవంతు కృషి చేస్తామని ఆయన చెప్పారు. విద్యార్థినులు తమ కళాశాలలో చేరాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



లెమన్ అండ్ స్పూన్ గేమ్ ఆడుతున్న చిన్నారులు

ఏర్పేడు: యువనేస్తం అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని నచ్చనేరి, చిందేపల్లె ఎస్టీ గ్రామాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, వలంటీర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉపాధి ఏపీఓలు

 

సుధాకరుడు, నాగభూషణమ్మ

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ఉపాధి హామీ ఏపీఓలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిచ్చాటూరులో పని చేస్తున్న ఏపీఓ బి.సుధాకరుడు నాగలాపురానికి, నారాయణవనం ఏపీఓ నాగభూషణమ్మ పిచ్చాటూరుకు, నాగలాపురం ఏపీఓ సుకన్య నారాయణవనానికి బదిలీ అయ్యారు. వారు మాట్లాడుతూ, అందరి సహకారంతో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించడానికి కృషి చేస్తామన్నారు.

వైద్యశాఖలో సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్

తిరుపతి తుడా: ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు అన్ని శాఖలతో పాటు వైద్య శాఖలో సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషంగా ఉందని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శాఖలో పరస్పర అంగీకార బదిలీల జీఓ విడుదల అయిన వెంటనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఉద్యోగుల సంఘం నాయకుడు అరవపాల్ కలిసి ఈ జీఓ వల్ల ఉద్యోగులు నష్టపోతారని విజ్ఞప్తి చేశారన్నారు. స్పందించిన ప్రభుత్వం అన్ని శాఖలతో సమానంగా సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ బుధవారం జీఓ జారీ చేసిందన్నారు.

సేవా సైనికులు వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



హాజరైన వలంటీర్లు, ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు సేవా సైనికుల్లా పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు గ్రామ వలంటీర్లు ఎంతగానో దోహదపడ్డారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రశంసించారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు చెందిన 194 మంది వలంటీర్లకు ఎమ్మెల్యే సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పతకాలు, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామ సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు సమష్టిగా పనిచేస్తేనే మండలం, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రజలందరికీ నవరత్నాలను చేర్చడానికి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పని చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అరణి విద్యానాథరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉగ్గుమూడి సంధ్య, సురుటుపల్లె దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు మణినాయుడు, ఇమామ్‌బాషా, నిరంజన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరిప్రసాద్, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, తహసీల్దారు హనుమాన్‌నాయక్, ఎంఈఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ

బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి, గ్రామ ఉప సర్పంచ్ మునిరాజా అనారోగ్యం బారిన పడి చికిత్స పొందారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ మండల కన్వీనర్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.

నాలుగేళ్ల జగనన్న పాలనపై సంబరాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్న సందర్భంగా బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాల గురించి వివరించారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

'అమృత్ సరోవర్'తో భూగర్భ జలాలు పెంపు



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో చేస్తున్న అమృత్ సరోవర్ పనులతో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని బండారుపల్లెలో అమృత్ సరోవర్, అముడూరు, చింతలపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు మజ్జిగ పంపిణీ చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అమృత్ సరోవర్ ద్వారా వ్యవసాయ బోర్లు, బావులలో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. కూలీలకు రోజుకు రూ.272 వచ్చేలా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటలను పెంచాలన్నారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, క్షేత్ర సహాయకులు రవిచంద్ర, వెంకటేష్, బాబు, కూలీలు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరాలయాభివృద్ధికి ఎంపీ నిధులు

- ఆలయ ఆవరణలో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు రూ.9 లక్షలు



తిరుపతి ఎంపీ గురుమూర్తికి కృతజ్ఞతలు చెబుతున్న పళ్లికొండేశ్వరాలయ చైర్మన్, ఈఓ, సభ్యులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం శ్రీ పళ్లికొండేశ్వరాలయ ప్రాంగణంలో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు రూ.9 లక్షలను తిరుపతి ఎంపీ గురుమూర్తి మంజూరు చేశారు. దీనికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ బుధవారం ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు ఎస్ఎం సురేష్ తిరుపతిలో ఎంపీ స్వగృహానికి వెళ్లి ఆయనను సత్కరించారు. ఎంపీ మాట్లాడుతూ, పళ్లికొండేశ్వరాలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

టీటీడీ ఈఓ స్ఫూర్తితో 'బర్డ్'లో శ్రమదానం



ర్యాలీగా వెళుతున్న బర్డ్ ప్రత్యేక అధికారి రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, వైద్యులు

తిరుపతి తుడా: శ్రమదానం చేయడం వల్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతి ఒక్కరిలో స్వచ్ఛ స్ఫూర్తి నింపుతుందని బర్డ్ ప్రత్యేక అధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డప్ప రెడ్డి అన్నారు. బర్డ్ ఆస్పత్రిలో బుధవారం వైద్యులు, వైద్య సిబ్బంది శ్రమదానం చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో చెత్తను ఊడ్చి, పిచ్చి మొక్కలను తొలగించారు. పరిశుభ్రతపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచపల్లి రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల టీటీడీ పారిశుద్ధ్య కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె చేశారన్నారు. ఆ క్రమంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల్లో స్వచ్ఛ చైతన్యం రగిలించిందన్నారు. కేవలం తమ విధులేగాక తిరుమల పరిశుభ్రత, మన కార్యాలయం మన బాధ్యత అని గుర్తు చేసిందన్నారు. అధికారులు, ఉద్యోగులు సంయుక్తంగా తిరుమల, పరిసర ప్రాంతాలను రోజుల తరబడి పరిశుభ్రంగా ఉంచేందుకు తీవ్రంగా శ్రమించారన్నారు. అదే స్ఫూర్తితో ఇకపై బర్డ్ ఆస్పత్రిలో ప్రతినెలా శ్రమదానాన్ని నిర్వహిస్తామన్నారు. బర్డ్ ఆస్పత్రి ఇప్పటికే పరిశుభ్రతలో సాటిలేని ఆస్పత్రిగా నిలిచిందన్నారు.



బర్డ్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది

ఫరీద్‌బాబాకు పురస్కారం



ఫరీద్‌బాబా దంపతులను సన్మానిస్తున్న తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్

రేణిగుంట: రేణిగుంటకు చెందిన జబ్బార్ ట్రస్ట్ అధినేత ఫరీద్‌బాబాకు శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఎన్టీఆర్ కీర్తి పురస్కార్‌తో సత్కరించింది. ఫరీద్ బాబా కళాసేవలను గుర్తించి హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజ గాన సభావేదికపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు అవార్డును అందజేశారు. ఫరీద్‌బాబా దంపతులను తెలంగాణ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పర్వతాల గంగమ్మకు విరాళం



విరాళమిస్తున్న మన్యం శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: మండలంలో కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లోని పర్వతాల గంగమ్మ ఆలయానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.40వేల విరాళం ఇచ్చారు. బుధవారం ఈ మొత్తాన్ని తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమూర్తి, పసుపులేటి రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినితో ఆటోడ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

నాయుడుపేటటౌన్: ఇంటర్మీడియెట్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసేందుకు ఆటోలో వెళుతున్న విద్యార్థినితో ఆటో డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన నాయుడుపేటలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. బుధవారం ఉదయం ఓ విద్యార్థిని నాయుడుపేట బస్టాండులో బస్సు దిగి, పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే ఆటోలో విద్యార్థిని మాత్రమే ఉండడంతో ఆటో నడుపుతున్న వ్యక్తి మానవ మృగంలా మారాడు. ఆటోను పరీక్ష కేంద్రం వద్ద నిలపకుండా ఎవరూ లేని ప్రాంతం వద్ద ఆటో ఆపి విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని కేకలు వేస్తూ పరుగులు తీసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహరావు ఆటోతోపాటు నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

వంతెన ప్రయాణం జర భద్రం

- మరమ్మతులకు నోచని వంతెన శ్లాబు
- పగుళ్లు, గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు



తడ-వరదయ్యపాళెం మార్గంలోని వంతెన

వరదయ్యపాళెం: తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలో కడూరు సమీపంలోని కరుణానది వంతెన శ్లాబు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆ వంతెన మీద ప్రయాణం వాహనచోదకులను ఇబ్బందులకు గురి చేస్తోంది. వంతెన శ్లాబు పూర్తిగా పగుళ్ల బారిన పడింది. అక్కడక్కడా పెద్ద గుంతలు ఏర్పడడంతో అటువైపు వెళ్లే వాహనదారులు ఆ గుంతలలో పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ 2004లో కరుణానది వంతెనను నిర్మించింది. 15 సంవత్సరాలకే వంతెన మొత్తం గుంతలమయం కావడం, ప్రధానంగా శ్లాబు ఈ చివరి నుంచి ఆ చివరి వరకు పూర్తిగా ఇదే పరిస్థితి ఉండడంతో అప్పట్లో ఏ మేరకు నాణ్యతగా నిర్మించారో ఇట్టే బోధపడుతుందని ప్రాంత వాసులు మండిపడుతున్నారు. కొన్ని చోట్ల ఇనుప కమ్మీలు తేలిపోయాయి. కనీసం గుంతలను పూడ్చాలనే స్పృహ కూడా ఆర్‌అండ్‌బీ లోపించిందనే విమర్శలు వస్తున్నాయి. అటు కల్కి, ఇటు శ్రీసిటీ ప్రాంతాలకు రోజూ వందలాది వాహనాలు ఇదే మార్గంలో వెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం! దీనిపై ఆర్ అండ్‌బీ ఏఈ రాంబాబు వివరణ కోరగా..త్వరలోనే వంతెనకు మరమ్మతులు చేయిస్తామని, గుంతలను పూడ్చిస్తామని చెప్పారు.



కరుణానది వంతెన శ్లాబుపై ఏర్పడ్డ గుంతలు

వేడుకగా బంగారమ్మ జాతర





ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ, అమ్మవారికి సారెను సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు

- ముక్కంటి సారె సమర్పించిన శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్

రేణిగుంట: శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మకాలనీలోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ బంగారమ్మ ఆలయంలో అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్‌తోపాటు పాలక మండలి సభ్యులు ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అర్చకులు, వేదపండితులు అమ్మవారికి పట్టువస్త్రాలను అలంకరించి విశేష పూజలు చేశారు. పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు చింతామణి పాండు, ఆలయాధికారులు ఏఈఓ లోకేష్‌రెడ్డి, ఏఈ వేణుగోపాల్, సబ్ టెంపుల్స్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా కరుణించమ్మా..!





నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ, సారెను తీసుకెళుతున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

రేణిగుంట: మండలంలోని అత్తూరులో గ్రామ దేవతలైన గంగమ్మ-మారెమ్మల జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు గంగమ్మకు అంబలి పోసి మొక్కులు చెల్లించారు. అర్ధరాత్రి అనంతరం నడివీధిలో పసుపుముద్దతో అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. పూలతో అలంకరించి వేపాకు పందిరి వేశారు. పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

సారె సమర్పించిన బియ్యపు ఆకర్ష్ రెడ్డి

ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు బియ్యపు ఆకర్ష్ రెడ్డి అమ్మవారికి మేళతాళాలతో వెళ్లి సారె సమర్పించారు. ఆయనకు ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్ శాలువా, పూలమాలలతో సత్కరించారు. అమ్మవారి దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. 52 ఏళ్ల తర్వాత గ్రామంలో జాతరను అట్టహాసంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్తులే కాకుండా గ్రామానికి బంధు పరివారం సైతం రావడంతో జనసందోహంతో కిక్కిరిసింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వర రెడ్డి, నాగసుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు గంగారి రమేష్, నగేషం, ముద్దురాయులు, మునిశేఖర్‌రెడ్డి, గిరిరెడ్డి, అత్తూరు త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడు : విశేషాలంకరణలో బంగారమ్మ

బంగారమ్మ ఆలయంలో ..

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం బంగారమ్మ ఆలయంలో బుధవారం జాతర సందర్భంగా అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. గురువారం జాతర పూజలు జరుగనున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరిప్రసాద్, రామదాసు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టాభిషేకం



నగరి మండలంలో టాపర్లుగా నిలిచిన పదో తరగతి విద్యార్థులతో మంత్రి రోజా

- 10వ తరగతి, ఇంటర్ ప్రతిభావంతులకు మంత్రి ఆర్‌కే రోజా అభినందన

నగరి : విద్యతోనే రాష్ట్రాభివృద్ధికి పునాది అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 85 మందిని, ఇంటర్‌మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 24 మందిని ఆమె బుధవారం తన చారిటబుల్ ట్రస్టు ద్వారా దుశ్శాలువలతో సన్మానించి షీల్డులు, బహుమతులు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చారు. విద్యార్థుల ప్రోత్సాహానికి ఇప్పటి వరకు నగరి చరిత్రలో లేని కొత్త అధ్యాయానికి ఆమె నాంది పలికారు. ఆమె మాట్లాడుతూ విద్యే రాష్ట్రాభివృద్ధి పునాది అని జగనన్న విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యను సాధారణ ప్రజలకు అందించిన ఘనత జగనన్నదే అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం నాడు-నేడు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, గోరుముద్ద, రాగి జావ, బైజూస్ కంటెంట్, ఇంగ్లిష్ మీడియం అంటూ ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యారంగానికి అరవై వేలకోట్లు ప్రభుత్వం వెచ్చిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఈ సహకారాన్ని అందిపుచ్చుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మేనమామ జగన్‌మోహన్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారన్నారు. అందుకే వారిని తమ ట్రస్టు ద్వారా అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య అన్నారు. ఆ విద్యలో కేజీ నుంచి పీజీ వరకు అండగా ఉండడానికి జగనన్న ఉన్నారన్నారన్నారు.

ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయండి

ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని విద్యార్థులు ఆ దిశగా దూసుకెళ్లాలని మంత్రి రోజా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో నంబర్‌వన్‌గా ఉండాలన్నారు. పిల్లల చదువుకు సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రికి ఆ చదువును విద్యార్థులకు అత్యుత్తమంగా బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నానని తెలిపారు. తాను కూడా సినిమా రంగం, రాజకీయ రంగాల్లోకి వచ్చినప్పుడు తొలుత అపజయాలే చవిచూశానని, అయినా ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు. మనల్ని మనమే ప్రోత్సహించుకుని ముందుకు సాగితే అన్నీ సాధ్యమవుతాయన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, చిత్తూరు, తిరుపతి డీఈఓలు విజయేంద్రరావు, శేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, నగరి, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, మునివేలు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓ శ్రీదేవి, జెడ్పీటీసీలు, వైస్ చైర్మన్లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతిలో విజయ్ ఆంటోని సందడి

- బిచ్చగాడు-2 చిత్రం విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు
- త్వరలో పార్ట్-3తో ముందుకొస్తా

తిరుపతి కల్చరల్: బిచ్చగాడు చిత్రం హీరో విజయ ఆంటోని బుధవారం తిరుపతిలో సందడి చేశారు. బిచ్చగాడు-2 చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా తిరుపతికి చేరుకున్న విజయ్ ఆంటోని తొలిత కపిలతీర్థంలోని బిచ్చగాళ్లతో కాసేపు ముచ్చటించి వారికి బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బిచ్చగాడు సినిమా ప్రదర్శిస్తున్న సీఎస్ సినిమాస్ (దేవేంద్ర థియేటర్)కు చేరుకున్నారు. ఈ సందర్భంగా థియేటర్ యాజమాన్యం, ఆయనకు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన తొలి బిచ్చగాడు చిత్రాన్ని ప్రేక్షక దేవుళ్లు ఆదరించి ఘన విజయాన్ని అందించారని గుర్తు చేశారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో బిచ్చగాడు-2 చిత్రాన్ని తీసుకొచ్చానని తెలిపారు. మొదటి పార్ట్ వ్యక్తిగత కథ అని, రెండో భాగం బిచ్చగాడు-2 సామాజిక దృక్పథంతో మంచి సందేశాత్మకంగా రూపొందించామని, ఈ చిత్రాన్ని కూడా ప్రేక్షకులు విజయాన్ని అందించడం సంతోషకరమన్నారు. మరో ఏడాది తర్వాత మూడో భాగంగా బిచ్చగాడు-3 చిత్రాన్ని రూపొందించి మీ ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులు హీరో విజయ్ ఆంటోనితో సెల్ఫీ దిగేందుకు ఎగబడ్డారు.



పేదలు, యాచకులకు నిత్యావసరాల పంపిణీ అనంతరం వారితో సెల్ఫీ